


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
19-11-2025
పేజీలు: 02



## మా అమ్మ ప్రాణాలను భారత్ కాపాడింది..
# మీడియాతో షేక్ హసీనా కుమారుడు

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ మీడియాతో మాట్లాడారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనాను అప్పగించాలని ఇటీవల బంగ్లాదేశ్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో హసీనా కుమారుడు సాజీబ్ మాట్లాడుతూ బంగ్లా న్యాయ ప్రక్రియను ఆయన వ్యతిరేకించారు. తన తల్లి పట్ల బంగ్లా సర్కారు సరైన రీతిలో ప్రవర్తించడం లేదన్నారు. సరిహద్దు వెంట ఉగ్రవాదం పెరుగుతున్నట్లు కూడా సాజీద్ భారత్‌ను హెచ్చరించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్ తన తల్లికి ఆశ్రయం కల్పించినందుకు ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే తన మాతృమూర్తిని చంపేందుకు మిలిటెంట్లు ప్లాన్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ప్రియుడిపై ప్రతీకారంతో
# యువతి చేసిన పనికి కోర్టు షాక్



ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన ఒక అత్యాచార కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రత్యేక ఎస్సీ-ఎస్టీ చట్టం కోర్టు తీర్పు నిచ్చింది. తప్పుడు ఆరోపణ చేసిన మహిళకు మూడున్నర సంవత్సరాల జైలు శిక్ష తోపాటు రూ. 30,000 జరిమానా విధించింది. ఈ తీర్పు ఆ మహిళ తన మాజీ ప్రియుడిపై తప్పుడు అత్యాచారం, ఎస్సీ-ఎస్టీ చట్టం కేసు నమోదు చేసింది. తన ప్రియుడికి వేరొకరితో నిశ్చితార్థం జరిగిందనే ప్రతీకారంతోనే ఆ మహిళ ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందని కోర్టు అంగీకరించింది. ఆ యువతి, యువకుడు చాలా సంవత్సరాలుగా ప్రేమలో ఉన్నారు. ఈ సమయంలో, వారు ఏకాభిప్రాయంతో శారీరక సంబంధాలు కొనసాగించారు. అయితే ఆ యువకుడి కుటుంబం అతని వివాహం వేరే చోట ఏర్పాటు చేశారు. ఆ యువతి కోపంగా అతనిపై అత్యాచారం, SC/ST చట్టంలోని తీవ్రమైన సెక్షన్ల కింద పోలీసు నివేదికను దాఖలు చేసింది. పోలీసు దర్యాప్తులో, ఆ మహిళ చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని తేలింది. ఇద్దరి మధ్య సంబంధం పూర్తిగా ఏకాభిప్రాయంతో జరిగిందని స్పష్టమైంది. బలవంతం లేదా ఒత్తిడికి సంబంధించిన సందర్భం లేదు. దీని తరువాత, తప్పుడు ఎఫ్ఐఆర్ దాఖలు చేసి చట్టాన్ని దుర్వినియోగం చేసినందుకు ఆ మహిళపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. వివాహేతర సంబంధాలు, అనైతిక సంబంధాలకు సంబంధించిన ఫిర్యాదులు ఇటీవలి సంవత్సరాలలో పెరుగుతున్నాయని ప్రత్యేక న్యాయమూర్తి వివేకానంద్ శరణ్ త్రిపాఠి తన తీర్పులో పేర్కొన్నారు. సంబంధం విచ్ఛిన్నమైనప్పుడు లేదా విడిపోయినప్పుడు, అత్యాచార కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఇది చట్టం తీవ్రమైన దుర్వినియోగం. ఏకాభిప్రాయ సంబంధాలను తరువాత అత్యాచారంగా ముద్రించలేమని కోర్టు పేర్కొంది. ఛార్జ్ షీట్ దాఖలు చేయడానికి ముందు రిలీఫ్ డబ్బు అందించడం తప్పు అని, అది తప్పుడు కేసులను ప్రోత్సహిస్తుందని కోర్టు పేర్కొంది. మహిళ అందుకున్న ఏదైనా ప్రభుత్వ పరిహారం లేదా రిలీఫ్ డబ్బును వెంటనే తిరిగి పొందాలని కోర్టు పోలీస్ కమిషనర్, జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది.



## జీహెచ్ఎంసీ ఎన్నికలకు
# జనసేన పార్టీ సిద్ధం

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజలింగం అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కేపీహెచ్‌బీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ హాజరై పార్టీ బలోపేతం, కార్యకర్తల సమీకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, వీర మహిళ చైర్మన్ కావ్య, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



## ప్రియురాలిని ముద్దులతో ముంచెత్తిన హార్దిక్ పాండ్యా

స్టార్ క్రికెటర్, టీమ్ ఇండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచారు. భార్య నటాషాతో విడాకుల అనంతరం హార్దిక్ మళ్లీ డేటింగ్‌లో ఉన్నారంటూ కొంతకాలంగా తెగ ప్రచారం జరుగుతోంది. మోడల్, నటి మహియెకా శర్మతో డేటింగ్‌లో ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ రూమర్స్ వేళ మహియెకాతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను స్టార్ క్రికెటర్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కుమారుడు అగస్త్య, మహియెకాతో ఉన్న ఫొటోలను హార్దిక్ ఇన్‌స్టాలో షేర్ చేశారు. అందులో ఓ వీడియోలో వీరిద్దరూ సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయారు. అందులో ప్రియురాలి బుగ్గపై హార్దిక్ ముద్దు పెడుతూ ఎంతో సంతోషంగా కనిపించాడు. ఈ ఫొటోలు దివాళీ వేడుకలవిగా తెలుస్తోంది. మరో ఫొటోలో జిమ్‌లో మహియెకాను ఎత్తుకుని చిరునవ్వులు చిందిస్తూ ఫొటోకు ఫోజులిచ్చాడు హార్దిక్. ప్రస్తుతం ఈ చిత్రాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## సిడ్నీలో కారు ప్రమాదం..
# 8 నెలల గర్భిణి మృతి

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన ప్రమాదంలో 8 నెలల గర్భిణి మృతిచెందింది. భర్త, మూడేళ్ల కుమారుడితో కలిసి ఈవినింగ్ వాకింగ్‌కు వెళ్లిన 33 ఏళ్ల సమన్వితా ధారేశ్వర్ ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల కథనం ప్రకారం.. జార్జ్ స్ట్రీట్‌లో రాత్రి 8 గంటలకు వాకింగ్ చేసి రోడ్డు దాటుతున్న సమయంలో ఆ దిశగా వస్తున్న కియా కార్నివల్ కారు నెమ్మదించింది. అయితే దాని వెనుక వస్తున్న బీఎండబ్ల్యూ కారు వేగంగా దూసుకువచ్చి కియా కారును ఢీకొట్టింది. ఆ వేగం ధాటికి కియా కారు ముందుకెళ్లింది. అయితే నడుచుకుంటూ వెళ్తున్న సమన్వితను ఢీకొట్టడంతో ఆమె గాయపడింది. తీవ్రంగా గాయాలు కావడంతో ఆమెను వెస్ట్‌మీడ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ డాక్టర్లు ఆమెను బ్రతికించలేకపోయారు. పుట్టబోయే బిడ్డను కూడా రక్షించలేకపోయారు.




## ఆర్ఆర్‌బీ రైల్వే ఉద్యోగాల
# దరఖాస్తు గడువు పెంపు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన జూనియర్ ఇంజనీర్ పోస్టుల సంఖ్య ఇటీవల భారీగా పెంచుతూ ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 2,588కి చేరింది. జూనియర్ ఇంజినీర్, డిపో మెటీరియల్ సూపరిటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి జమ్మూ-శ్రీనగర్, చెన్నై రిజియన్ల పరిధిలోని ఖాళీలను పెంచినట్లు ఆర్ఆర్‌బీ తన ప్రకటనలో తెలిపింది. అలాగే ఆన్‌లైన్ దరఖాస్తు గడువును కూడా ఏకంగా 10 రోజులపాటు పొడిగించినట్లు ఆర్ఆర్‌బీ ప్రకటన జారీ చేసింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారు ఎంచుకున్న ఆర్ఆర్‌బీ, పోస్టు ప్రాధాన్యత, రైల్వే జోన్/ప్రొడక్షన్ యూనిట్ ప్రాధాన్యతలను ఎటువంటి రుసుము చెల్లించకుండా సవరించుకోవచ్చు. ఈ సదుపాయం నవంబర్ 25 నుంచి అందుబాటులోకి వస్తుంది. దరఖాస్తు చివరి తేదీ వరకు సవరణకు అవకాశం కల్పించనుంది. ఆర్ఆర్‌బీ అక్టోబర్‌లో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2,569 భర్తీ చేస్తున్నట్లు తన ప్రకటనలో తెలిపింది. ఇందులో చెన్నై రీజియన్‌లో 160 ఉండగా వాటిని 169కు, జమ్మూ-శ్రీనగర్ రీజియన్‌లో 88 ఉండగా.. వాటిని 95 ఖాళీలను పెంచింది. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 2,588కు పెరిగింది. అలాగే నవంబర్ 30తో దరఖాస్తు ముగియనుండగా దానిని డిసెంబర్ 10 వరకు పొడిగించింది. దరఖాస్తు ఫీజు చెల్లింపులు డిసెంబర్ 12వ తేదీ వరకు అవకాశం కల్పించింది. అప్లికేషన్ సవరణకు డిసెంబర్ 13 నుంచి 22 అవకాశం కల్పించింది. ఇతర వివరాలు ఈ కింది లింక్ ద్వారా తెలుసుకోవచ్చు.

## మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నా..
# మల్లోజుల వేణుగోపాల్ పిలుపు

మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నట్లు మావోయిస్టు దళ మాజీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పిలపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మల్లోజుల వీడియో సందేశం పంపారు. నిన్నటి ఎన్‌కౌంటర్‌లో హిడ్మా సహా ఆరుగురు చనిపోవడం బాధాకరం అని మల్లోజుల పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నాను అని చెప్పారు. మారిన పరిస్థితుల దృష్ట్యా సాయుధ పోరాటం కొనసాగించలేం. ప్రజల్లో చేరి పోరాటం చేయాలని కోరుతున్నా. ప్రజల్లో ఉండి రాజ్యాంగబద్ధంగా పోరాటం సాగించాలి. పరిస్థితులు మారుతున్నాయి.. దేశం కూడా మారుతోంది. ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో పాటు పలువురి ప్రాణాలు పోయాయి. మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించింది అని మల్లోజుల పేర్కొన్నారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు నన్ను సంప్రదించొచ్చు. నా ఫోన్ నంబర్ 8856038533 కు సంప్రదించవచ్చు అని మల్లోజుల సూచించారు.





## నేను కూడా లైంగిక వేధింపుల బాధితురాలినే..
# మంచు లక్ష్మి షాకింగ్ కామెంట్స్

తాను కూడా లైంగిక వేధింపుల బాధితురాలినే అని చెప్పి షాకిచ్చారు ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి. తన టాలెంట్‌తో ఇండస్ట్రీలో మంచి పేరు తెచ్చుకున్న ఈ మంచు వారి వారసురాలు.. నిజాన్ని నిక్కచ్చిగా చెప్పడానికి ఏ మాత్రం సంకోచించరు. బోల్డ్ కామెంట్స్ చేయడంతోపాటు సమాజంలో జరిగే పలు విషయాల పట్ల తనదైన శైలిలో స్పందిస్తుంటారు మంచు లక్ష్మి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను ఎదుర్కొన్న లైంగిక వేధింపుల సంఘటనను బయటపెట్టారు.కేవలం 15 ఏళ్ల వయసులో జరిగిన ఈ దారుణ అనుభవం ఆమె మనసుపై ఇప్పటికీ ముద్ర వేసి ఉందని ఆమె వెల్లడించారు. "నేను ఎప్పుడూ సొంత వాహనంలోనే ప్రయాణించేదాన్ని. కానీ ఒకసారి పదో తరగతి హాల్ టికెట్ల కోసం స్కూల్ యాజమాన్యం పబ్లిక్ బస్సులో తీసుకెళ్లింది. ఆ బస్సులో ఒక వ్యక్తి అసభ్యంగా నన్ను తాకాడు. నేను పూర్తిగా షాక్ అయ్యాను. ఏం చేయాలో అర్థం కాలేదు" అని చెప్పారు. ఆ క్షణంలో కలిగిన భయాన్ని తాను ఇప్పటికీ వెంటాడుతున్నాయని తెలిపారు. సెలబ్రిటీ కుటుంబం నుంచి వచ్చిన తనకే ఇలాంటి ఘటన జరిగితే, రోజూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో ప్రయాణించే సామాన్య యువతులు, మహిళలు ఎంతటి భయానక పరిస్థితులు ఎదుర్కొంటారో ఊహించడం కష్టమని మంచు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. "చాలా మంది అమ్మాయిలకు ఇలాంటి వేధింపులు జరుగుతాయి. కానీ భయం, సిగ్గు, సమాజం ఏమనుకుంటుందో అన్న ఆలోచనతో నోరు మూసుకుని భరిస్తారు" అని బాధపడ్డారు.



# ఈ ఇడియట్ ఎవరంటూ పోస్ట్

శ్రియ శరణ్ తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని నటి శ్రియ శరణ్. మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ వంటి సీనియర్ హీరోల సరసన హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన శ్రియ, ఆ తర్వాత పవన్ కళ్యాణ్, మహేష్ బాబు, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతోనూ నటించి స్టార్ స్టేటస్‌ను ఎంజాయ్ చేసింది. అయితే గత కొంతకాలంగా హీరోయిన్ రోల్స్ తగ్గిపోవడంతో, శ్రియ మెల్లగా మదర్ రోల్స్ వైపు అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. శ్రియ శరణ్ మొదటిసారి స్క్రీన్‌పై మదర్ షేడ్స్ ఉన్న పాత్రల పోషించింది 'గోపాల గోపాల' సినిమాతోనే. వెంకటేష్ భార్యగా, ఇద్దరి పిల్లల తల్లిగా కనిపించిన శ్రియ, ఆ తర్వాత 'దృశ్యం' లోనూ అలానే ఫ్యామిలీ వుమన్ పాత్రను పోషించింది. సోషల్ మీడియాలో శ్రియ డీపీతో పాటు ఫోన్ నెంబర్ కనిపిస్తుండగా, అది శ్రియదే అంటూ వైరల్ చేశారు. ఈ క్రమంలో శ్రియ స్పందిస్తూ.. ఈ ఇడియర్ ఎవరసలు.. ప్రజల సమయం వేస్ట్ చేస్తున్నాడు. నిజంగా ఇలా సమయం వృథా చేయడం బాధ అనిపిస్తుంది. అది నేను కాదు, ఆ నెంబర్ కూడా నాది కాదు. నన్ను ఇష్టపడే వ్యక్తులని తన ఫాలోవర్స్‌గా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు ఈ స్టుపిడ్ పర్సన్. ఒకరిని అనుకరించకుండా సొంతగా జీవించడం నేర్చుకోండి అంటూ శ్రియ సోషల్ మీడియాలో కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. అయితే శ్రియ పోస్ట్‌పై నెటిజన్స్ పలు రకాలుగా స్పందిస్తున్నారు. వాడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండని సలహా ఇస్తున్నారు.
a

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## రైతుల ఖాతాల్లో రూ.7 వేలు..

# ఈ నెల 19నే జమ!



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు భారీ శుభవార్త అందించింది. ఈ నెల 19వ తేదీన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 18వ విడతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అన్నదాత సుఖీభవ' స్కీమ్ రెండో విడత నిధులు ఒకేసారి విడుదల కానున్నాయి. రెండు పథకాలు కలిపి ప్రతి రైతుకు రూ.7 వేలు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఈ రెండో విడతలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ వాటా రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ వాటా రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతులకు అందనుంది. గతేడాది మొదటి విడతలో రూ.6 వేలు (కేంద్రం రూ.2వేలు + రాష్ట్రం రూ.4వేలు) ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈసారి రాష్ట్ర వాటా మరో వెయ్యి రూపాయలు పెంచడం రైతులను ఆనందంలో ముంచెత్తింది. కడప జిల్లాలోని కమలాపురంలో ఈ నెల 19న ఘనంగా జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా బటన్ నొక్కి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46,62,904 మంది రైతు కుటుంబాల ఖాతాల్లోకి మొత్తం రూ.3,077 కోట్లు ఒకేసారి జమ కానుండడం ఇప్పటివరకు ఏపీలో అతిపెద్ద డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కార్యక్రమంగా నిలవనుంది. రైతుల ఆదాయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు సర్కారు.. పీఎం కిసాన్‌ను మరింత బలపరుస్తూ, రాష్ట్రం నుంచి అదనంగా రూ.5 వేలు ఇవ్వడం ద్వారా దేశంలోనే అత్యధిక సాయం అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపింది. ఈ డబ్బు రైతుల చేతికి అందగానే రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహం నింపనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మారేడుమిల్లిలో మరో ఎన్‌కౌంటర్.. మృతుల్లో మావోయిస్ట్ కీలక నేతలు అజాద్, దేవ్‌జీ..!



కొన్నాళ్లుగా కేంద్ర బలగాలతో పాటు వివిధ రాష్ట్రాల పోలీసులను ముప్పతిప్పలు పెట్టిన హిడ్మా.. మంగళవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో హిడ్మా భార్య రాజక్క తోపాటు మరో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోనే మరోసారి ఎదురుకాల్పలు జరిగినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ ధృవీకరించారు. అల్లూరి జిల్లా జి.ఎం. వలస సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు హతమైనట్లు వెల్లడించారు. మృతుల్లో మావోయిస్టు కీలక నేతలు అజాద్, దేవ్‌జీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఘటనకు సంబంధించి మరికాసేపట్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ లడ్డా తెలిపారు. మంగళవారం మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత కొందరు మావోయిస్టులు పారిపోయారని లడ్డా తెలిపారు. వారిని పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలోనే ఎదురు కాల్పులు జరిగినట్లు తెలిపారు.



## ట్రంప్‌తో విభేదాల తర్వాత.. తొలిసారి వైట్‌హౌస్‌కు వెళ్లిన మస్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు వచ్చిన విషయం తెలిసిందే. ఓ బిల్లు విషయంలో మిత్రులు కాస్తా శత్రువులయ్యారు. ఈ విభేదాల నేపథ్యంలో మస్క్ వైట్‌హౌస్ ను వీడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ట్రంప్‌తో విభేదాల తర్వాత మస్క్ తొలిసారి వైట్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ విందులో పాల్గొన్నారు. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ దాదాపు ఏడేళ్ల తర్వాత అమెరికాలో పర్యటించారు. అధ్యక్షుడు ట్రంప్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సౌదీ క్రౌన్ ప్రిన్స్‌కు ట్రంప్ ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ విందుకు మస్క్ కూడా హాజరుకావడం విశేషం. మస్క్‌తోపాటూ ఈ విందులో పోర్చుగల్ సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో, ఎన్విదియా సీఈవో జెన్సెన్ హువాంగ్ కూడా హాజరయ్యారు.



## ఏవోబీలో మరో ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టులు హతం

ఆంధ్రప్రదేశ్ అల్లూరి జిల్లాలోని మారేడుమిల్లిలో మరోసారి తుపాకులు గర్జించాయి. తూటాల వర్షం కురిసింది. పోలీసులు — మావోయిస్టులకు మధ్య చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్రా లడ్డా తెలిపారు. బుధవారం తెల్లవారుజామున బీఎం వలస వద్ద కాల్పులు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఎదురుకాల్పులకు సంబంధించిన పూర్తి వివరాలను మధ్యాహ్నం వరకు మీడియాకు వెల్లడిస్తామన్నారు. చనిపోయిన మావోయిస్టుల్లో అగ్రనేతలు ఆజాద్, దేవ్‌జీ ఉన్నట్లు సమాచారం.

## దిగొస్తున్న బంగారం ధర..


బంగారం, వెండి ధరలు క్రమేణా దిగొస్తున్నాయి. దేశ, విదేశీ మార్కెట్లలో ప్రస్తుతం నెలకొన్న ప్రతికూల పరిస్థితులు మొన్నటిదాకా రికార్డు స్థాయిలో పలికిన రేట్లకు కళ్లెం వేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం ఒక్కరోజే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.3,900 పడిపోయింది. దీంతో రూ.1,25,800గా నమోదైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లను తగ్గించకపోవచ్చన్న అంచనాలు.. గోల్డ్ మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపర్చాయని ట్రేడింగ్ వర్గాలు తాజా సరళిని విశ్లేషిస్తున్నాయి. చివరి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గిన విషయం తెలిసిందే.



## పత్తి సంక్షోభం తొలగిందా? మంత్రి తుమ్మల హామీతో జిన్నింగ్ మిల్లర్లు సంతృప్తి!



ఖమ్మం జిల్లాలో రైతులు, జిన్నింగ్ మిల్లర్లు ఎదుర్కొన్న పత్తి కొనుగోలు సమస్యకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిగొచ్చారు. జిన్నర్లతో జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం మంత్రి సానుకూల స్పందన తెలిపారు. వారు ఎదుర్కొంటున్న సాంకేతిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. ఈ హామీతో జిన్నింగ్ మిల్లర్లు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు — నేటి నుంచే పత్తి కొనుగోళ్లను అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ఆధార్ అథెంటికేషన్‌తో పాటు మొబైల్ OTP ఆధారంగా కొనుగోళ్లు జరపాలని సూచించారు. ఈ డ్యూయల్ వెరిఫికేషన్ విధానంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు పూర్తవుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఖరీఫ్ రైతులకు మరింత ఊరట కల్పిస్తూ మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు పరిమితులను గణనీయంగా పెంచుతూ మంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎకరానికి మొక్కజొన్న 18 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్లకు, సోయాబీన్ 6.72 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లకు పెంచారు. ఈ నిర్ణయంతో వేలాది మంది రైతులు భారీ ఉపశమనం పొందనున్నారు. పత్తి నుంచి మొక్కజొన్న వరకt రైతు సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార మార్గాలు చూపిన తుమ్మల నాగేశ్వరరావు చర్యలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.



## సంయుక్తతో బాలయ్య మాస్‌స్టెప్పులు

ఈ 'జాజికాయ జాజికాయ' పాటను విశాఖపట్నంలోని జగదాంబ థియేటర్ వేదికగా అభిమానుల సమక్షంలో చిత్రబృందం గ్రాండ్‌గా వదిలింది. ఈ సందర్భంగా విడుదలైన లిరికల్ వీడియోకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. బాలకృష్ణ ఎనర్జీ, నటి సంయుక్త మీనన్ గ్లామర్ ఈ పాటలో హైలైట్‌గా నిలిచాయి. సంయుక్తతో బాలయ్య వేసిన మాస్ స్టెప్పులు అభిమానులకు పూనకాలు తెప్పించే విధంగా ఉన్నాయి. 'జాజికాయ జాజికాయ' పాటను కాసర్ల శ్యామ్ పల్లెటూరి నేపథ్యాన్ని, మాస్ ఎనర్జీని మిళితం చేస్తూ సాహిత్యాన్ని అందించారు. బ్రిజేశ్ శాండిల్య, గాయని శ్రేయా ఘోషల్ ఈ పాటను అద్భుతంగా ఆలపించారు.




## ఇకపై 'వాట్సప్‌లో మీసేవ'

తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ పాలనకు మరో అడుగు పడింది. ఇకపై విద్యార్థులు అత్యవసర విద్యా పత్రాలు కోసం మీసేవా కేంద్రాల ఎదుట క్యూల్లో నిలబడాల్సిన పనిలేదు. వాట్సాప్ ఓపెన్ చేస్తే చాలు_ _ _ మీ అవసరమైన డాక్యుమెంట్లు మీ ఫోన్‌లోనే చిటికెలో అందుబాటులో ఉంటాయి. రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థులకు ప్రత్యేకమైన సాయం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

ఒక్క మెసేజ్‌తో హాల్ టికెట్లు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ ఇప్పుడు 8096958096 అనే వాట్సాప్ నంబర్ ద్వారా ఎప్పుడైనా 24 గంటలు, వారంలో ఏడు రోజుల పాటు_ _ _హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వీలు ఉంటుంది. SSC, ఇంటర్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పోటీ పరీక్షలు_ _ _ ఏ పరీక్షకు అయినా కావాల్సిన హాల్ టికెట్ ఒక మెసేజ్ దూరంలోనే అందుబాటులో ఉంటుంది. మీసేవ, మెటా కలసి తీసుకొచ్చిన ఈ సేవలతో మొత్తం 38 శాఖలకు చెందిన 580కి పైగా సేవలు వాట్సాప్ ద్వారా విద్యార్థుల ముందుకు రానుండటం విశేషం.

ఇంకా మరెన్నో సేవలు

వాట్సాప్ ఆధారిత మీసేవా సేవలను మరింత యాక్సెస్ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. త్వరలో ఈ సర్వీస్‌ను తెలుగు, ఉర్దూ భాషల్లో కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతే కాదు.. వాయిస్ కమాండ్ ఫీచర్‌ను కూడా డెవలప్ చేస్తున్నారు. దీని ద్వారా ఫోన్‌ను తాకకుండా సేవలు పొందే అవకాశం ఉంది. త్వరలో మరిన్ని శాఖలను ఈ ప్లాట్‌ఫారమ్‌కు చేర్చి సేవలను విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు.

## పిల్లలు పుట్టలేదనే మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

పిల్లలు పుట్టలేదనే మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనహైదరాబాద్ లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతురాలి తల్లి, పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లికి చెందిన అనిల్ కుమార్ తో అదే ప్రాంతానికి చెందిన సౌజన్య (27)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అనిల్ నగరంలోని ఓ సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, సౌజన్య ఇంటి వద్దే ఉంటుంది. పెళ్లై రెండేళ్లు గడుస్తున్నా వీరికి పిల్లలు కలగలేదు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన సౌజన్య ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

## ప్రతిరోజూ విజయం సాధించలేం

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలతో వార్తల్లో నిలిచిన మను భాకర్ మళ్లీ ఆ స్థాయిలో రాణించలేకపోతోంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో పతకాల వేట కొనసాగిస్తుందనుకుంటే అనూహ్యంగా ఖాళీ చేతులతో నిష్క్రమిస్తోంది. తాజాగా ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భాకర్ నిరాశపరిచింది. కైరో వేదికగా జరిగిన టోర్నీలో విఫలమైన ఆమె ఓటమిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎవరైనా ప్రతిరోజూ విజయం సాధించలేరు, ఈ పరాజయం నుంచి చాలా నేర్చుకుంటాను అని అంటోంది విశ్వ విజేత. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పతకం సాధించేలా కనిపించిన మను భాకర్ ఫైనల్లో తేలిపోయింది. ర్యాపిడ్ ఫైరింగ్ క్వాలిఫికేషన్‌లో 586 పాయింట్లు సాధించి టాప్-8లో నిలిచిన ఆమె.. ఫైనల్లో గురి తప్పింది. కేవలం రెండు సార్లు మాత్రమే లక్ష్యాన్ని సాధించి నిరాశపరిచింది. తన ఓటమిపై స్పందించిన ఆమె.. 'వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకాలే లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ, మెరుగైన ప్రదర్శనే చేయలేదు. మంచి స్కోర్లే సాధించినా.. పోడియం మీద నిల్చోలేకపోయాను. నా టీమ్మేట్ ఇషా పతకం సాధించింది.

